www.prajasakti.com
ప్రజాశక్తి

చంద్రయాన్-3 కౌంట్‌డౌన్ ప్రారంభం

- 9 రోజుల వ్యవధిలోనే మళ్లీ ఇంకో ప్రయోగం
- 13న మధ్యాహ్నం 2.35 గంటలకు కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: చంద్రయాన్-3 ప్రయోగంతో భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోట సందడిగా ఉంది. అత్యంత భద్రత ప్రదేశమైనా ఈ రాకెట్ ప్రయోగ కేంద్రం ప్రస్తుతం కీలకమైన చంద్రయాన్-3 ప్రయోగంతో మరింత పటిష్టమైనది. షార్ అడవుల్లో సిఐఎస్ఎఫ్ దళాలు కూబింగ్ నిర్వహిస్తున్నారు. సూళ్లూరుపేట, శ్రీహరికోట మార్గంలోను, షార్‌లోని మొదటి, రెండవ గేట్ల వద్ద, లాంచ్ ప్యాడ్ వరకు అడుగడుగున తనిఖీలు నిర్వహిస్తున్నారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు, కోస్ట్ గార్డ్ గస్తీ తీవ్రం చేశారు. మూడు రోజులు ముందు నుంచే షార్ భద్రతా వలయంలో ఉంది. 13వ తేదీ గురువారం మధ్యాహ్నం 2.35గంటలకు కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇది నిరంతరం 24 గంటల పాటు కొనసాగుతుంది. ఎంఆర్ఆర్ సమావేశాలు బుధవారం నిర్వహించారు. ఇదిలా ఉంటే శ్రీహరికోటలో చంద్రయాన్-3 ప్రయోగ తుది ఏర్పాట్లు ఒకవైపు జరుగుతుంటే మరోవైపు పిఎస్ఎల్వి సి-57 రాకెట్ ప్రయోగం జరపడానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఈనెల 14న మధ్యాహ్నం 2.35 గంటలకు చంద్రయాన్-3ని సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగిస్తున్నారు. అనంతరం తొమ్మిది రోజుల వ్యవధిలోనే ఈనెల 23న ఉదయం 6.30 గంటలకు పిఎస్ఎల్వీ సి-57 రాకెట్‌ను ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగించడానికి సమాయత్తం అవుతున్నారు. ఈ రాకెట్ ద్వారా సింగపూర్, మలేషియా వంటి దేశాల కమర్షియల్ శాటిలైట్లను అంతరిక్షంలోకి చేర్చబోతున్నారు. ఒకేసారి షార్‌లో ఐదు రాకెట్లను అనుసంధానం చేసుకునే సౌకర్యాలు ఉన్నాయి. మరో రెండు రాకెట్లు మొదటి, రెండవ ప్రయోగ వేదికలపైకి చేర్చి తుది పరీక్షలు జరుపుకోవడానికి కూడా అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో షార్‌లో కేవలం చంద్రయాన్-3తో సరిపెట్టుకోకుండా పదేపదే లాంచింగ్‌లు జరపడానికి శాస్త్రవేత్తలు రేయింబవళ్ళు శ్రమిస్తున్నారు.

కౌంట్‌డౌన్‌కు సిద్ధమవుతున్న చంద్రయాన్ -3

జిల్లాకు గత వైభవాన్ని తీసుకురావడానికి కృషి

పాలఉత్పత్తిలో చిత్తూరు జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పాల ఉత్పత్తిలో చిత్తూరు జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కషి చేద్దామని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు మ్యాంగో భవన్‌లో పశుసంవర్ధక శాఖ ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు జరుగుతున్న పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పాడి రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లాలో పాడి పెంపకం, పశు పోషణకు రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, పాల నాణ్యత ఉత్పత్తిలో జిల్లాకు మంచి పేరు కలదని, పాల ఉత్పత్తిలో జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేందుకు సమిష్టిగా కషిచేయాలని తెలిపారు. చిత్తూరు జిల్లాకు పాలఉత్పత్తికి సంబంధించి గతంలో ఉన్న వైభవాన్ని తీసుకొని వచ్చేందుకు ప్రస్తుతం ప్రభుత్వం చర్యలు చేపడుతూ అమూల్ డెయిరీని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పాడి పశువులకు తక్కువ ఖర్చుతో మంచి దాణాను అందించేందుకు అవసరమైన మెలుకువలను పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా రైతులందరికీ అవగాహన కల్పించడం జరుగుతున్నదని తెలిపారు. ఎక్కువ పోషకాలు ఉండే పచ్చగడ్డి పెంపకం, దాణాగా పశు వులకు అందించడం ద్వారా అధిక పాలఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. అమూల్ డెయిరీ ద్వారా రైతులకు సరియైన ధర అందుతుందని, గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇందుకు సంబంధించి భూమిపూజ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులకు పశుగ్రాశాల పెంపకంపై ఆవశ్యకత మరియు అవగాహన కొరకు పశుగ్రాస వారోత్సవాలను జూలై 7 నుండి 14 వరకు నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. జిల్లాలో గడ్డి విత్తనాలు, టిఎంఆర్, గడ్డి కత్తిరించి యంత్రాలను ఆర్బికేల ద్వారా రాయితీపై రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎల్‌డిఏ ఛైర్మన్ సంతోష్ కుమార్, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ గంగరాజు, పలమనేరు రీసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ డాక్టర్ అరుణ, పాడి రైతులు పాల్గొన్నారు.

పశుగ్రాస వారోత్సవాల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

17న కలెక్టరేట్ ఎదుట కళాప్రదర్శన

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు బంగారు మురళీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలోని జానపద కళలను కాపాడుకోవడానికి 17న కలెక్టరేట్ వద్ద జరిగే కళాప్రదర్శనలును జయప్రదం చేయాలని బుధవారం చిత్తూరులో జరిగిన జానపద వత్తికళాకారుల సంఘం జిల్లా సమావేశం పిలుపునిచ్చింది. ఈసమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్ర అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జానపదవత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారపు మురళి మాట్లాడుతూ జిల్లాలో 43రకాల జానపద కళలు ఉంటే కేవలం అవి 15కు మాత్రమే పరిమితమైనాయని, రోజురోజుకి కలలు కనుమరుగవుతున్నాయని ఇలాంటి కలలను కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతిఒక్కరి పైన ఉందని అన్నారు. ప్రధాన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అయితే ప్రభుత్వాలు బాధ్యతలు విస్మరిస్తున్నాయని అన్నారు. కళాకారులు లేనిదే ఏపని జరగని పరిస్థితుల్లో ఉన్నప్పటికీ వాటిని నిర్లక్ష్యం చేయడం సరైనది కాదన్నారు. వతి కళాకారులకు పింఛన్లు ఇవ్వాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ అందని పరిస్థితి ఉందని, జానపద వత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో అనేక రకాల ఆందోళన కార్యక్రమాలు చేసి కొన్ని హక్కులు సాధించినప్పటికీ అన్నిచోట్ల అమలు కావడం లేద విమర్శించారు. జిల్లాలో ప్రధానమైన ఆలయం కాణిపాకం ఉన్నప్పటికీ అక్కడ జరిగే ఉత్సవాల సందర్భంగా స్థానికంగా ఉన్న కళాకారులను ఉపయోగించకుండా బయట రాష్ట్రాల కళాకారులు తీసుకువచ్చి ప్రదర్శించడం వలన స్థానిక కళాకారులకు ఉపాధిలేని పరిస్థితి ఉందని, ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడడానికి జిల్లాలో ఉన్న కలలను కాపాడుకోవడానికి కళాకారులకు ఉపాధి కల్పించడానికి 17న జరిగే కళాప్రదర్శనలలో ప్రతి కళాకారుడు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేంద్రన్ ఉపాధ్యక్షులు వాడ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జానపద ప్రదర్శనకు డీఆర్‌వోకు ఆహ్వానం

ఈనెల 17వ తేదీ చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే జానపద కళల ప్రదర్శనకు డిఆర్ఓను జానపద వత్తి కళాకారుల సంఘం నాయకులు బుధవారం కలెక్టరేట్లోని వీఆర్వో ఛాంబర్‌లో కలిసి ఆహ్వానించారు. జానపద కళల ప్రదర్శనకు సహకరించాలని వినతిపత్రం అందించారు.

జానపద ప్రదర్శనకు డీఆర్‌వోను ఆహ్వానిస్తున్న నాయకులు

ఫ్రెష్ బస్సు దృష్టి ప్రశంసనీయం

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

బెంగుళూరు-తిరుపతి మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్రెష్ ఈవి బస్ ఫ్లీట్‌ను కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక తాజ్ హోటల్ వద్ద బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సులు వలన కాలుష్యం తగ్గుతుందని అన్నారు. డీజిల్, ముడి చమురు దిగుమతిపై ఆధారపడటాన్ని కూడా తగ్గుతుందన్నారు. పర్యావరణ అనుకూల రవాణాను ప్రోత్సహించడం, కర్బన ఉద్గారాలను తగ్గించడం కోసం ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన ముందడుగు అన్నారు. కస్టమర్ అనుభవం, భద్రత, ఆవిష్కరణలపై ఫ్రెష్‌బస్ దృష్టి ప్రశంసనీయమన్నారు. అనంతరం ఫ్రెష్ బస్ వ్యవస్థాపకుడు సుధాకర్ రెడ్డిచిర్రా మాట్లాడుతూ దేశాభివద్ధికి స్వచ్ఛమైన ఇంధన పరిష్కారాలను ప్రోత్సహించడంలో నిబద్ధతతో కషి చేస్తున్నందుకు మంత్రికి కతజ్ఞతలు తెలియజేశారు. ఫ్రెష్ బస్సు హరిత భారతదేశం దిశగా ముందడుగు వేస్తుందన్నారు. తమ ఎలక్ట్రిక్ బస్సులు అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉంటాయి, ఇవి ప్రయాణీకుల సౌకర్యాన్ని పెంచడమే కాకుండా కఠినమైన నాణ్యతా ప్రమాణాలను కూడా కలిగి ఉంటాయని, టెయిల్‌పైప్ ఉద్గారాలను తొలగించడం ద్వారా, ఈ బస్సులు వాయుకాలుష్యాన్ని తగ్గించడానికి, పౌరుల మొత్తం జీవననాణ్యతను మెరుగుపరచడానికి గణనీయంగా దోహదపడతాయి. ఒక్క ఫ్రెష్ బస్సు 90,000 లీటర్ల డీజిల్ ఒక సంవత్సరం వ్యవధిలో ఆదా చేస్తుందన్నారు. దాదాపు 200టన్నుల సిఓ2 ఉద్గారాలను తగ్గిస్తుంది. ఇది పర్యావరణంపై దాదాపు 10,000 చెట్ల ప్రభావానికి సమానమని అన్నారు. తిరుపతి కాణిపాకం మధ్య మరో ఎలక్ట్రికల్ బస్సుని కూడా మంత్రి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ కమిషనర్ ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజీ, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, తుడా కార్యదర్శి లక్ష్మి, అధికారులు, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎంపీ గురుమూర్తి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, జెసి డికె బాలాజీ, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌ఓ, విజయవాడ రాకేష్ కుమార్ సింగ్, ఎన్‌హెచ్‌ఏఐ అడ్వైసర్ ప్లాంటేషన్ ఏకే జైన్, ఎన్‌హెచ్ పిడి.వెంకటేశ్వర్లు, సిఈ ఎన్‌హెచ్ రామచంద్ర, మోర్త్ ఆర్‌ఓ బెహ్రా, జిల్లా ఆర్ అండ్ బి అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలకు చేరుకున్న కేంద్రమంత్రి గడ్కరీ

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం రాత్రి చేరుకున్నారు. ఆయనకు టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి స్వాగతం పలికి బస ఏర్పాట్లను చేశారు. గురువారం ఉదయం ఆయన దర్శనం చేసుకొనున్నారని టిటిడి అధికారులు తెలిపారు. ఈవో వెంట జేఈఓ వీరబ్రహ్మం ఉన్నారు.



పోలీస్ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మే 18వ తేదీన పిసిఆర్ కళాశాలలో గార్డ్ విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన పురుషోత్తం ఏఆర్‌హెచ్‌సి 3376, బుధవారం జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ ఎస్ఐబీ శ్రీలక్ష్మి, పోలీస్ ఆఫీస్ క్లర్క్ పార్థ సారధి సమక్షంలో కార్పస్ ఫండ్‌లో నుండి రూ.1,00,000ల చెక్కును వారి సతీమని ఆర్.విజయలక్ష్మికి అందజేయడం జరిగింది. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ డిపార్టుమెంటు తరపున వారి కుటుంబానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని వారి కుటుంబానికి రావలసిన అన్ని ప్రయోజనాలను త్వరగా అందేలా చేస్తామని తెలిపారు.

జిల్లాలో పాల ఉత్పత్తి పెంపునకు సంబంధిత శాఖలు

సమన్వయంతో పనిచేయండి : జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లాలో పాలఉత్పత్తి పెంపునకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ వద్దగల సమావేశం మందిరంలో జెసి జగనన్న పాలవెలువ కార్యక్రమములో తీరుపై డిఆర్‌డిఏ, పశుసంవర్ధకశాఖ, డెయిరీ డెవలప్మెంట్, కో-ఆపరేటివ్, అమూల్‌కు సంబంధించిన సంబంధిత అధికారులతో సమావేశమై చర్చించారు. ఈసందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాడి పరిశ్రమను అభివద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని స్వయం సహాయక సంఘ మహిళలు ఆర్థిక సమద్ధి సాధించేందుకు వారికి అవసరమైన ఆర్థిక తోడ్పాటును అందించే దిశగా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంను సద్వినియోగం చేసుకొని అభివద్ధి చెందేలా కషిచేయాలని తెలిపారు. జిల్లాలో జగనన్న పాలవెల్లువ ద్వారా 101ఏఎంసీలు పరిధిలో వి.కోట, రామకుప్పం, శాంతిపురం మండలాలలో పాల సేకరణ చేయడం జరుగుతుందని, ఈ నెల 11వ తేదీన 11,601 లీటర్ల పాల సేకరణ చేయడం జరిగిందని డెయిరీ డెవలప్మెంట్ అధికారి రవిచంద్రన్ జెసికి వివరించారు. వైయస్సార్ చేయూత పథకం కింద పొందిన ఆర్థిక లబ్దిని పాడి పోషణలో ఆసక్తి ఉన్న మహిళలకు మరింత సాయంగా స్త్రీనిధి కింద ఆర్థికసాయం అందించి వారు పాడి పోషణకు అవసరమైన సాయంను డిఆర్‌డిఏ పిడి అందిస్తున్నామని పిడి తులసి జెసికి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్, కోఆపరేటివ్ ఆఫీసర్ బ్రహ్మానందరెడ్డి, అమూల్ డిస్టిక్ కోఆర్డినేటర్ నవీన్, అధికారులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ కోసం న్యాయపోరాటం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉంటూ జిల్లా పాడిరైతులను ఆదుకుంటున్న విజయ డెయిరీని అమూల్‌కు అప్పనంగా రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీ.జగదీష్ పేర్కొన్నారు. బుధవారం విజయ డెయిరీ వద్ద సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో 50 శాతం రైతాంగం పాడి పరిశ్రమంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నేపథ్యంలో సహకార రంగంలో కొనసాగిన విజయ డెయిరీని మరింత పటిష్ట పరచాల్సి ఉండగా గుజరాత్ కంపెనీకి కట్టబెట్టడం మోడీ ఆశీస్సులు పొందేందుకేనన్నారు. విజయ డెయిరీ ఆస్తులు రూ.650కోట్లు వుండగా రూ.99కోట్లకు లీజు చట్టవిరుద్ధమని దీనిపై న్యాయపోరాటం కూడా చేసేందుకు ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ 40 సంవత్సరాల క్రితం విజయ డెయిరీని ప్రారంభించి పాడి రైతులను ఆదుకుంటున్న పరిశ్రమను నేడు అమూల్ లాంటి కార్పొరేట్ కంపెనీకి అప్ప చెప్పినందున జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. సహకార చక్కెర కర్మాగారాలు, మూసి వేశారని సహకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్రంలో విజయవాడ, విశాఖలో విజయ డెయిరీలు మంచిగా నడుస్తున్నా చిత్తూరు డెయిరీని అమూల్‌కు అప్ప చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట వ్యాపితంగా అమూల్‌పై ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు.

కార్మికుల శ్రేయస్సే అమర రాజా లక్ష్యం

మోడిఫైడ్ ఎంప్లోయర్స్ యుటిలైజేషన్ డిస్పెన్సరీ ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు, చిత్తూరు టౌన్: అమర రాజా గ్రూప్‌కు చెందిన సిఎస్ఆర్ విభాగమైన రాజన్న ఫౌండేషన్‌తో పాటుగా వారి గ్రూప్ కంపెనీలలో ఒకటి అయిన మంగళ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎంఐఎల్, ఎంప్లాయి స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఇఎస్ఐసి సంయుక్తంగా బుధవారం మోడిఫైడ్ ఎంప్లోయర్స్ యుటిలైజేషన్ డిస్పెన్సరీని చిత్తూరు జిల్లా, పూతలపట్టు మండలం, పేటమిట్ట గ్రామంలో గల రాజన్న ఫౌండేషన్ ప్రాంగణంలో అట్టహాసంగా ప్రారంభించారు. ఎంప్లాయి స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఈఎస్ఐ పథకం క్రింద ఏర్పాటు చేసిన ఈసదుపాయం ఈఎంఈయుడి ఇది కార్మికుల ఉపాధి ప్రదేశానికి దగ్గరగా ఒక డిస్పెన్సరీని స్థాపించడానికి సంస్థలకు మద్దతుగా రూపొందించబడింది. ఇది రాజన్న ఫౌండేషన్ ఆవరణలో ఉండటంతో పేటమిట్ట, తేనేపల్లి ప్రాంతం సమీపంలోని వివిధ పరిశ్రమలలో పనిచేసే వేలాది మంది కార్మికులు, వారి కుటుంబసభ్యులకి గొప్ప అవకాశంగా ఉండనుంది. అమర రాజా కంపెనీ ఇఎస్ఐసి స్థానిక, ప్రాంతీయ, కేంద్ర కార్యాలయాలతో కలిసి పనిచేస్తుంది. పేటమిట్ట, తేనేపల్లి, చుట్టుపక్కల 10కిలోమీటర్ల పరిధిలో నివాసం ఉండే అమర రాజా ఉద్యోగులతోపాటు వివిధ పరిశ్రమలలో పనిచేసే ఇతర ఈఎస్ఐ అర్హత కలిగిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకి అవసరమైన ప్రాథమిక వైద్యసేవలతో పాటు ఈఎస్ఐసి చట్టం కింద ఇతర ప్రయోజనాలను కూడా అందించనుంది. ఈ కేంద్రం అందించే సహాయాన్ని మరింత మెరుగుపరచడానికి, అత్యవసర అంబులెన్స్ సేవలు. ఇతర సహాయక సౌకర్యాలను రాజన్న ఫౌండేషన్ అందిస్తుంది. అమర రాజా గ్రూప్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ రామచంద్ర గల్లా మాట్లాడుతూ ఇది మా అత్యంత విలువైన ఆస్తిగా పరిగణించబడుతున్న మా ఉద్యోగుల యోగక్షేమాలను చూడటంలో మా అచంచలమైన నమ్మకానికి నిదర్శనం అన్నారు. ఈ డిస్పెన్సరీ మా ఉద్యోగులు, చుట్టుపక్కల కమ్యూనిటీకి అవసరమైన వనరులు, మార్గదర్శకత్వం, మద్దతును అందజేస్తుందని తద్వారా వారు ఆరోగ్యకరమైన, సంతోషకరమైన మరింత ఉత్పాదక జీవితాలను గడపడానికి వీలు కల్పిస్తుందని అన్నారు. అమర రాజా గ్రూప్ ప్రెసిడెంట్- గ్రూప్ హెచ్ఆర్ బి.జైకష్ణ మాట్లాడుతూ పేటమిట్టలో యుటిలైజేషన్ డిస్పెన్సరీ కోసం మా దీర్ఘకాల అభ్యర్థనను ఇఎస్ఐసి అధికారులు ఎట్టకేలకు గుర్తించి ఆమోదించినందుకు మేము సంతోషిస్తున్నామని అన్నారు. ఇఎస్ఐసి డైరెక్టర్ రాధాకష్ణ మాట్లాడుతూ ఈ తరహా డిస్పెన్సరీ ఎంఈయుడి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిది రాజన్న ఫౌండేషన్ ప్రాంగణంలో దీనిని స్థాపించడానికి అమర రాజా గ్రూప్‌తో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉందన్నారు. ఇది ఈ ప్రాంతంలోని చాలా మంది బీమా పొందిన ఉద్యోగులకి ప్రయోజనం చేకూరుస్తుందని అలాగే అనేక కార్పొరేట్‌లు అనుసరించడానికి ఒక రోల్ మోడల్‌గా ఉపయోగపడుతుందని అన్నారు. అమర రాజా బ్యాటరీలు చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ సి.నరసింహులు నాయుడు, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ నళిని కుమార్, రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ రాళ్ళపల్లి, మంగల్ ఇండస్ట్రీస్ హెచ్ఆర్ మేనేజర్ రవికుమార్, అమర రాజా హెచ్ఆర్ సీనియర్ జనరల్ మేనేజర్ ఆండ్రూ జయకుమార్, ఈఎస్ఐసి డైరెక్టర్స్ రాధాకష్ణ, రజనీకాంత్, శ్రీధర్, మంగళ ఇండస్ట్రీస్ బిజినెస్, ఫైనాన్స్ హెడ్స్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐఓయుయు సంస్థలు ప్రతినిధులు

నీటి సరఫరా.. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వర్షాకాలం నేపథ్యంలో నగరంలో నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కమిషనర్ 28వ వార్డు పరిధిలోని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా తీరు, క్లోరినేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఓఇంటి వద్ద సిఎస్ఆర్ ట్యాంక్ నుండి సరఫరా అయ్యే నీటికి క్లోరిన్ పరీక్ష నిర్వహించి పరిశీలించారు. నీటి సరఫరా సక్రమంగా అవుతోందా? సరిపోయేంత నీరు వస్తుందా? సమాచారం ఇస్తున్నారా అని స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. స్థానికంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని స్పష్టం చేశారు. అనంతరం సిఎస్ఆర్ ట్యాంక్ నీటికి క్లోరిన్ పరీక్ష నిర్వహించి పరిశీలించారు. లాగ్ పుస్తకాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో.. నీటిసరఫరా, పారిశుద్ధ్యంపై ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రధానంగా పైప్లైన్ల ద్వారా నీటి సరఫరా జరుగుతున్న అన్ని ప్రాంతాల్లో క్రమం తప్పకుండా క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. నీరు, పారిశుద్ధ్య లోపం కారణంగా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కాచి వడపోసిన శుభ్రమైన నీటిని తాగడానికి ఉపయోగించాలని, ఇంటి పరిసరాలను శు భ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటప్రసాద్, డీఈ రమణ, ఏఈలు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే పట్టాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి-పుంగనూరు: గృహ నిర్మాణ పథకం ద్వారా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల ఇళ్ల పట్టాలను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భగంగా పుంగనూరు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాడు- నేడు పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నాడు-నేడు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం కింద రెండో విడతలో జరుగుతున్న 10 కాంపోనెంట్ పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గూడూరు పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనుల పురోగతిలో వెనుక బడడానికి గల కారణాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు వేరొక పాఠశాల నుండి అవసరమైన నిధులను ఏర్పాటు చేయాలని ఎంఈఓను కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించని, ఇంటి పనులు ప్రారంభించి మధ్యలో ఇంటి నిర్మాణం నిలిపివేసిన లబ్ధిదారులతో మాట్లాడుతూ మీరు ఇంటి నిర్మాణాలు ప్రారంభించని పక్షంలో ఇంటి పట్టాతో పాటు ఇల్లు రద్దు చేసి ఇండ్లు నిర్మించు కునేందుకు ఆసక్తి చూపే అర్హులైన లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నారాయణ, ఎంఈఓ చంద్రారెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, ముడా ఛైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ నాగరాజు రెడ్డి, ఐకెపి ఏపీఎం రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధికే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రజల అభివృద్ధికే సంక్షేమ పథకాలు ప్రారంభించినట్టు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని తగ్గువారిపల్లి సచివాలయ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ అండ రెడ్డిపల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూరు రామచంద్రా రెడ్డి, ఎంపీపీ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని కెనమాకుల పల్లి పంచాయతీలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం తొలి రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఎస్ శ్రీనివాసులు, ఎంపీపీ కే వసుంధర కోదండ రెడ్డి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి తదితరులు పాల్గొన్నారు.

వాహన యజమానులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సోమల: మండలంలో ఇటీవల ద్విచక్ర వాహనాల చోరీలు అధికమయ్యాయని, చోరీలు జరగకుండా వాహన యజమానులు అప్రమత్తంగా ఉండి తమ వాహనాలను ఇంటిముందు పార్కింగ్ చేయకుండా ఉండాలని, ఒకవేళ ఇంటిముందు పార్కింగ్ చేసినా సరియైన భద్రతా చర్యలు తీసుకోవాలని సోమల పోలీస్ వారు తెలిపారు. బుధవారం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో మైక్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు, సర్పంచి భాష మసూద్ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు భూమి పూజ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రూ.50 లక్షలతో సిసి రోడ్లు నిర్మిస్తున్నట్టు జిల్లాఅటవీ శాఖ అధికారి చైతన్య కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గోశాల నుండి మొగిలి దేవరకొండకు సిసి రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఇందుకు సహకరించిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, ఎఫ్ఆర్‌వో శివన్న, ఎఫ్ఎస్ఓ రమేష్, ఎఫ్‌బిఓ యుగంధర్, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నగరి : మున్సిపల్ పరిధి ఇందిరానగర్ పరిధిలోని రామ్‌నగర్ ఎ,బిలలో గడపగడపకు నిధులు రూ.10 లక్షల వ్యయంతో సిమెంట్

రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణానికి మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి భూమిపూజ చేశారు. బుధవారం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్‌ఛైర్మన్ బాలన్, కౌన్సిలర్లు భారతి, బిలాల్, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-చౌడేపల్లి: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డిఇ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం చౌడేపల్లి పరిధిలోని గడ్డంవారిపల్లి మార్గంలో గల వైఎస్సార్ కాలనీని ఆయన సందర్శించారు. ఇక్కడ 91 మందికి పట్టాలు ఇవ్వగా వారిలో 16 ఇండ్లు పూర్తి చేసుకున్నారని, మిగతావి వివిధ దశలో ఉన్నాయని ఆయన అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరగా చేయించి ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించాలని ఆయన అధికారులకు సూచించారు. హౌసింగ్ ఏఈ మణి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ వారిచే బుధవారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో నిర్వహించారు. 'నేటి లేగ దూడలే రేపటి పాడి ఆవులు' అని, దూడ పుట్టినప్పటి నుండి మంచి పోషక విలువలు గల ఆహారాన్ని అందించడంతో భవిష్యత్తులో ఆరోగ్యకరమైన పాడి ఆవుగా ఎదిగి ఆరోగ్యకరమైన దూడలను అందించే అవకాశం ఉందని పలువురు వక్తలు అన్నారు. లేగ దూడల ప్రదర్శనలో మొత్తం 33 ప్రదర్శనకు రాగా, వీటిలో ఐదు లేగ దూడలను ఎంపిక చేసి వాటి యజమానులకు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతి ఎన్ కదిరప్ప, రెండవ బహుమతి అహ్మద్ భాష, మూడవ బహుమతి మునియ్య నాయుడు, నాలుగవ బహుమతి సోమశేఖర్, ఐదవ బహుమతి సుబ్రహ్మణ్యం నాయుడులు గెలుపొందారు. కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు బాలసుబ్రమణ్యం, నగరి సహాయ సంచాలకులు వాసు, సోమల పశు వైద్యశాల సంచాలకులు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో వివిధ ట్రేడ్లలో ఉన్న ఖాళీలకు రెండవ విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో వివిధ ట్రేడ్లలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు రెండవ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 12 నుంచి 31వ తేదీ సాయంత్రంలోపు తమ విద్యార్హత సర్టిఫికెట్లతోపాటు ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు, అభ్యర్థి పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోగలరని తెలిపారు. మహిళలకు కంప్యూటర్, టైలరింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు, దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆగష్టు 3వ తేదీ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కాగలరని పేర్కొన్నారు.

మానవహక్కులపై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి, నగరి : ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని నివాసితులకు మానవహక్కులపై మండల స్థాయి అధికారులు అవగాహన కల్పించాలని ఆర్డీవో సుజన అన్నారు. బుధవారం కార్యయంలో డివిజన్ పరిధిలోని మండలాల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతినెల చివరివారం ఎస్సీ, ఎస్టీకాలనీల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలన్నారు. వారికి ఉన్న హక్కులపై అవగాహన ఏర్పరచాలన్నారు. మూడు నెలలకోసారి డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

తలనీలాల వేలంలో రూ.1.80 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్కంధపుష్కరిణీ సమీపంలోని కుమారగిరిపై వెలసిన వళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆడికత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన తలనీలాల బహిరంగ వేలంలో ఆలయానికి రూ.1.80 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడికత్తిక వేడుకల సందర్భంగా భక్తులు సమర్పించే తలనీలాలకు పుష్కరిణీ ఆవరణంలో ఆలయ అధ్యక్షుడు కే.కేశవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలంలో తమిళనాడుకు రాష్ట్రం గుడియాత్తంకు చెందిన శ్రీయోగానందనాయుడు రూ.1.80 లక్షల వేలాన్ని దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం రూ.1.70 లక్షల ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది రూ.10 వేలు అదనంగా వచ్చిందన్నారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివద్ధికి వెచ్చించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.కృష్ణనాయక్, పాలక మండలి పయణిరెడ్డి, మంజుల, ఆయమ్మ, రేవతి, కుమారాచ్చరి, హరికుమార్ పాల్గొన్నారు.

వేరుశనగ పంట నష్టంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని గద్రాజు పల్లి పంచాయతీ మర్రిమాకులపల్లి గ్రామానికి చెందిన నారాయణమ్మ, భర్త పి సుబ్రహ్మణ్యం వీరికి సర్వేనెంబర్ 32 2/3 లో ఉన్న తమ సొంత భూమిలో వేరుశనగ పంట వేసుకొని పూతకు వచ్చిన సమయంలో రాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌తో పూర్తిగా దున్నేసారని స్థానిక నవీన్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలియజేశారు. ఈ సందర్భంగా నారాయణమ్మ మాట్లాడుతూ ఎవరో ఉద్దేశపూర్వకంగానే మా మీద కక్ష సాధించడానికి ఈ దురాగతానికి పాల్పడ్డారని తెలిపారు. తాను దళిత కుటుంబానికి చెందిన వ్యక్తి అని, నేను నా భర్త కూలి పనులు చేసి జీవనం సాగిస్తున్నామని విత్తనాలకు వ్యవసాయానికి అప్పులు చేసి పంటవేగా ఇలా దునివేయడం తీవ్ర మనస్థాపానికి గురి అవుతున్నామని గతంలో కూడా మా ఆయిల్ ఇంజన్ను తీసుకెళ్ళిపోయారని అప్పుడు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశామని రాత్రి వేళల్లో ఎవరెవరు ఈ ప్రాంతాలలో తిరుగుతూ ఉండటంతో ప్రాణ భయంతో మేము ఇంటికి పరిమితమైతున్నామని విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం భూముల విలువ పెరిగిపోవడంతో ఉద్దేశ్య పూర్వకంగా కావాలనే మమ్ములను ఇక్కడి నుండి తరిమికొట్టాలన ఇలా మమ్ములను ఇబ్బందులకు గురిచేసి మా పంటలు నష్టపరుస్తున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ కార్మిక కార్యదర్శి ఓబుల్ రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడ సంఘటనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం దళితులకు రక్షణ లేకుండా పోతుందని, ఈ విషయంపై రెవెన్యూ అధికారులు, పోలీసులు స్పందించి పంటను నష్టపరిచిన వారిపై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

తెదేపా మినీ మ్యానిఫెస్టో గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-యాదమరి: రాక్షస పాలనపై యుద్ధం మొదలైందని, తెదేపా కార్యకర్తలంతా సన్నద్ధం కావాలని పూతలపట్టు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జ్ డాక్టర్ మురళీ మోహన్ పిలుపునిచ్చారు. మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ (మినీ మ్యానిఫెస్టో) పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు క్లస్టర్ 1ఇన్చార్జ్ హేమగిరి చిట్టి గారు 10వేల గోడ పత్రికలను రూపొందించారు. ఈ గోడ పత్రికలను బుధవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ మురళీ మోహన్ యాదమరి పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తిరుగుబాటుతో వైకాపా ప్రభుత్వం కాలగర్భంలో కలిసిపోతుందని, ఈ దశలో తెదేపా కార్యకర్తలు మరింత చురుకైన పాత్ర పోషించి తెదేపాను అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. తెదేపా ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై ప్రజల్లో విస్తతమైన చర్చ జరగడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

యాదమరి తెదేపా కంచుకోట

యాదమరి మండలం తెదేపా కంచుకోట అని ఇన్‌ఛార్జ్ మురళీ మోహన్ పేర్కొన్నారు. మండల ప్రజలు వైకాపా ప్రభుత్వ అసమర్థ విధానాలతో విసిగిపోయారన్నారు. ధరల పెరుగుదలతో ప్రతి కుటుంబం అనేక రూపాల్లో ఆర్థికంగా నష్టపోయిందన్నారు. చంద్రబాబు పాలన కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. కార్యకర్తలంతా సంఘటితమై ముందుకు కదిలితే అత్యధిక మెజార్టీ తథ్యమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మొరార్జీ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రబ్బీ, క్లస్టర్ 2 ఇన్చార్జి చిత్ర నాయుడు, రైతు సంఘం నాయకుడు రాజేంద్ర నాయుడు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలపై వాలంటీర్లు ఖండిస్తూ స్థానిక ఎంపిడీవో కార్యాలయం వద్దకు మండలంలోని 268 మంది వాలంటీర్లు బుధవారం అక్కడికి చేరుకొని అక్కడినుండి ర్యాలీగా వెళ్తూ పవన్ కళ్యాణ్ ప్రశ్నించాలి అనే నినాదాలతో చెక్‌పోస్ట్ వద్ద వరకు ర్యాలీగా కొని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను పెట్రోల్ పోసి వాలంటీర్లు నిప్పండించారు అనంతరం వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలనులో ఉంచుకొని వెంటనే అరెస్ట్ చేయాలని పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ నినాదాలతో వాలంటీర్ల ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన విద్యా విధానంపై సదస్సు

ప్రజాశక్తి-గుడుపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) ఆధ్వ ర్యంలో వర్సిటీలోని అధ్యాపక సిబ్బందికి "నూతన జాతీయ విద్యా విధానం - 2020" అమలుపై ప్రత్యేక ఓరియెంటేషన్ లెక్చర్‌ను బుధవారం నిర్వహించారు. వర్సిటీలోని ఎమెనో సెమినారు హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్సిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకష్ణ, విశిష్ట అతిథిగా రాయలసీమ యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్, యునివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మాజీ యుజిసి - హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య వై.నరసింహులు, గౌరవ అతిథులుగా వర్సిటీ రెక్టార్ ఆచార్య టి.అనురాధ, రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షులుగా వర్సిటీ డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వల్లూరు లోకనాథం, ప్రత్యేక అతిథిగా వర్సిటీ న్యాక్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఎం.ఎన్.వెంకటేషులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్య పంటలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని గౌనితిమ్మేపల్లి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై స్టేట్ నుండి ఎస్ఆర్‌పి రామచంద్ర మరియుజిల్లా నుండి డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ వాసు, ఎన్ఎఫ్ఏ.చందు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. గౌనితిమ్మేపల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా కంప్లెయింట్ బాక్సులు చూడడం జరిగింది. తరువాత హిమామ్ సాబ్ అనే రైతు పొలంబడి ప్లాట్‌ను పరిశీలించారు. అదేవిధంగా ఆ గ్రామంలోని రైతులు అందరూ వేరుశెనగ క్రాప్‌లో ఖచ్చితంగా యూనివర్సల్ మోడల్ పద్ధతిలో వేయాలి అని ఎస్ఆర్‌పి రైతులకి తెలియజేశారు. ముఖ్యం గా వేరుశెనగ పంటలో కంది, ఆనప, అలసంద మరియు 16 రకాల విత్తనాలుని వేరుశెనగ పంటలో వేయాలి అని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ప్రకతి వ్యవసాయ సిబ్బంది, రైతులు హాజరు అయినారు. పకతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీకళాశాలను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) బందం బుధవారం సందర్శించారు. రెండు రోజులు పాటు కళాశాలలో తనిఖీలో భాగంగా రాయపూర్‌లోని రవిశంకర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శివపుత్ర పరగుండి, బీవండి బీఎస్ఎన్ కళాశాల ప్రొఫెసర్ అశోక్ దామోదర్ వేఘా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పలు విభాగాలను సందర్శించారు. అనంతరం కళాశాలలో అమలవుతున్న విద్యా విషయాలపై కళాశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థుల వారి తల్లితండ్రులతో ప్రత్యేకంగా సమావేశమై పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో భాగంగా కార్యాలయంలో ఆటోమేషన్ సిస్టం ద్వారా టీసీ ఇవ్వడం, స్మార్టు బోర్డు బోధనలు, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాలపై పరిశీలించి సంతప్తిని వ్యక్తం చేశారు. కడప ఆర్జేడీ బాబు, కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బాలాజీ, ఎంపీపీ లతబాలాజీ, మేజర్ పంచాయతీ కార్వేటి నగరం సర్పంచ్ ధనంజయవర్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకరరెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ద్విచక్రవాహనాల వేలం

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పాలసముద్రం, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో అక్రమంగా సారా తరలిస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడిన ద్విచక్రవాహనాలను గురువారం ఉదయం 10.30 గంటలకు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సిఐ నాగరాజు బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు.

ప్రైవేటు యాజమాన్యాలతో సమావేశం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యానికి, సిబ్బందికి ఎంఈఓ లీలారాణి మండల వనరుల కేంద్రంలో పాఠశాల నిర్వహణపై బుధవారం సమావేశం నిర్వహించారు. అందులో ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో కార్పోరల్ పనిష్మెంట్స్ ఇవ్వరాదని ఆదేశించారు. అంతేకాకుండా యుడిఐఎస్ఇ పూర్తి చేయాలని ఆర్‌టిఇ యాక్టు ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లల బడిలో ఉండాలని, విద్యార్థులకు ఫిజికల్‌గా టిసి ఇచ్చిన ఆ విద్యార్థి వేరొక పాఠశాలలో చేర్పించిన తర్వాతనే ఆన్లైన్ టిసిలు ఇష్యూ చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో గవర్నమెంట్ ఆర్డర్స్ ప్రకారం లీవులు వర్కింగ్ డేస్ ఉండాలని హెచ్చరించారు. స్కూల్ బస్, డ్రైవర్‌కి లైసెన్సులు ఉండేలా చూసుకోవాలని, స్కూల్ ఫీ పర్టికులర్స్ పాఠశాల డిస్‌ప్లే బోర్డులో ఉంచాలని, రోజూ పాఠశాలలో 10 గంటలలోపు విద్యార్థులు అటెండెన్స్‌ను ఆన్లైన్లో పూర్తిచేసేలా చూసుకోవాలన్నారు.

మాటలు కాదు చేతల్లో చూపించాలి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వాలంటీర్లను దేవత వ్యవస్థగా వర్ణించిన ఉపముఖ్యమంత్రి వాలంటీర్లలో ఒకరికి ఎమ్మెల్యే స్థాయి కల్పించాలని, మాటలు కాదు చేతల్లో చూపించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ యుగంధర్ పొన్న ఉపముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. బుధవారం మండలంలోని పచ్చికాపల్లం కేంద్రంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో వాలంటీర్ల ధర్నాకు ప్రతిస్పందనగా అభిషేకం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెదురుకుప్పం మండల అధ్యక్షులు పురుషోత్తం, మండల బూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, మండల యువజన అధ్యక్షులు సతీష్, మండల ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన మదన మోహన్ బాబు

ప్రజాశక్తి-సోమల: రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు పురందరేశ్వరిని, బిజెపి జాతీయ కార్యదర్శి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని వారి వారి స్వగృహాల్లో పుంగనూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ మదన్‌మోహన్ బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రతి ఇంటినీ సర్వే చేయాలి

ప్రజాశక్తి-యాదమరి: గ్రామంలోని ప్రతి ఇంటినీ జ్వరాల సర్వే చేపట్టాలని సిహెచ్ఓ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షేత్రస్థాయి సిబ్బంది సమావేశం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ. బుధవారం నుండి జ్వరాల సర్వేను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశిం చిందన్నారు. సమావేశంలో హెల్త్ సూపర్వైజర్ అనసూయ మ్మ, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ భారతం మిట్ట, దాసరివారి పల్లె గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే బోరు మోటారు స్టార్టర్ మరమ్మతుకు గురవడంతో ఈనెల 11 వ తేదీ ప్రజాశక్తిలో సమస్యపై వార్త ప్రచురణకు నోచుకుంది. దీంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్ స్టార్టర్‌ను బాగు చేయించి బుధవారం బోరు మోటారుకు బిగించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ ఎస్‌వి ఇర్లపల్లె గ్రామంలో మూడు రోజుల క్రితం తాగునీటిని సరఫరా చేసే బోరు మోటారు కాలిపోవడంతో పంచాయతీ జేఏసీ కన్వీనర్ గంగులప్ప, పంచాయతీ సిబ్బంది కలసి బుధవారం మోటార్‌ను బాగు చేసి బోరులో దింపి తాగునీటి సరఫరాను గ్రామంలోని 100 కుటుంబాలకు పునరుద్ధరించారు. తాగునీటి సమస్య తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుడిపల్లి: మండలంలోని ఓఎన్ కొత్తూరు గ్రామపంచాయతీకి చెందిన దేవాపురం గ్రామంలో తాగునీటి సమస్య ఉండటంతో వెంటనే స్పందించిన సర్పంచ్ దేవప్ప నాయుడు కొత్త బోరు బుధవారం డ్రిల్ చేయడంతో పుష్కలంగా నీళ్లు వచ్చాయి. దీంతో ఆ గ్రామ తాగునీటి సమస్య పరిష్కారమైనట్లు సర్పంచ్ తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు ఆయనకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ద్రవ జీవామృతంతో అధిక దిగుబడి సాధించారని జిల్లా డిపిఎం వాసు అన్నారు. బుధవారం మండలంలోని బొంబాయి గ్రామంలో ద్రవ జీవామృతంతో చేపడుతున్న వ్యవసాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల సాంద్రతలో రసాయన ఎరువులు అధికంగా వాడటం వలన నేలసారం దెబ్బతిందని, దీనికి ద్రవ జీవామృతం ఎంతో మేలు చేస్తుందని, పంటలపై వచ్చే చీడపీడలను వీటిని పిచికారి చేయడం వలన పంట నాణ్యత దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిపిఎ సిబ్బంది చందు రామచంద్ర, రైతులు మంజుల, జగదీశ్వర్ రెడ్డి, గోవిందయ్యలు పాల్గొన్నారు.

మాజీ సింగిల్ విండో ఉపాధ్యక్షుడి మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మాజీ సింగిల్ విండో ఉపాధ్యక్షులు పూర్ణచంద్ర అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత మూడు నెలలుగా ఆయన అనారోగ్యంతో మదనపల్లి, బెంగళూరు ఆసుపత్రిలో చికిత్సలు చేయించి, కొద్దిగా మెరుగవడంతో గత రెండు రోజులకు మునుపు స్వగ్రామం తుంబకుప్పం చేరుకున్నాడు. బుధవారం అస్వస్థతకు గురై మృతి చెందడంతో ఆయన మృతి పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళ హత్య

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మహిళ హత్యకు గురైన సంఘటన తవణంపల్లి మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ శంకర్ రెడ్డి కథనం మేరకు వివరాలు.. తవణం పల్లి మండలంలోని ఎగవ మారేడుపల్లి గ్రామానికి చెందిన క్రిష్టమనాయుడు భార్య అనసూయమ్మ (72) ఒంటరిగా నివశిస్తుంది. ఈమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆమె నిద్రిస్తుండగా నోటికి గుడ్డలు అదిమి శబ్దం చేయకుండా హత్య చేసినట్టు, స్థానికులు మరుసటి రోజు వెళ్లి పరిశీలించగా ఆమె మంచంపై విగత జీవిగా పడి ఉండటంతో వారు ఈ సమాచారాన్ని పోలీసులకు అందించారు. సంఘటన స్థలాన్ని అడిషనల్ ఎస్పీ లక్ష్మి, డిఎస్పి శ్రీనివాసు మూర్తి, ఎస్ఐ సుధాకర్ రెడ్డి పరిశీలించారు. శవ పరీక్ష నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. బుధవారం ఒంటిలవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో మన బడి, నాడు-నేడు పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని, కోట్లు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. అనంతరం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఎం విజయకుమార్, ఎంపీపీ లతబాలాజీ దంపతులను పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలారాణి, ఎంపిటిసి విమల, ఏఈ నాగభూషణం, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల వితరణ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు సుబ్రమణ్యం పిళ్లై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా నైపుణ్యం పెంచుకొని ఆరోగ్యంగా, శారీరకంగా, దృఢంగా మారాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ క్రీడ పరికరాలు అందజేసిన పలమనేరు పరిరక్షణ సమితికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఆనందబాబు, పీఎస్ కార్యదర్శి నరసింహులు, శ్రీపురం సీతారామయ్య, విజయ్ కుమార్, వెంకట్, నారాయణ తదితరులు పాల్గొన్నారు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PUTTUR
I.A.NO. 71 / 2020
I.A.NO. 70 / 2020
I.A.NO. 69 / 2020
O.S.NO. 58 / 2018

BETWEEN:
Puttur Shanmugam Reddy ....Petitioner/Pliantiff
AND:-
S. Shanmuga Chetty (died), and others ......Respondents/Defendants

NOTICES TO RESPONDENTS NO. 6 :-

R6. S. Dhananjaya,
S/o Late S. Shanmugam Chetty,
Hindu aged about 23 years, Student,
Vedurukuppam Village and Post and Mandal,
Chittoor Dist.,

Please take notices that, the above case was filed by the plaintiff as against you and some others for partition in the above court and the same is posted on : 20/07/2023. Hence you are here by directed to attend before the above court at about 10.30 A.M either by person or through Advocate. Otherwise the above case will be decided an exparty.

Hg. date : 20/07/2023

G. Raja Reddy, B.Com., L.L.B.,
P. Kumarvel, B.Com., L.L.B.,
Advocates, Puttur.

IN THE COURT OF THE 1ST ADDL. JUNIOR CIVIL JUDGE AT CHITTOOR
O.S.No. 899 OF 2022

Between:
Union Bank of India, Sundarayyar Street Branch, Chittoor Rep by its Branch Manager **...Plaintiffs**
And:
M/s S.R.Diamond Poly Packs,
Rep by its Propretix Smt N.Subashini & 2 others **...Defendants**

NOTICE TO DEFENDANTS 1 & 3

To:
1) M/s S.R.Diamond Poly Packs,
Rep by its Propretix Smt N.Subashini,
W/o Chengal Rao, Plot No.50,Industrial Esate,Chittoor
3) Chengal Rao, S/o D.Adhinarayana Rao,
D.No.1-37, Doddipalli(V & P),
Chittoor Mandal & Dist

Sir, Please take notice that the Plaintiff filed the above suit against defendants No.1 to 3. The above matter is posted to **27-07-2023** for the appearance of defendants 1 and 3 and for filing objections,if any.Please take notice and be present on the said date before the Hon'ble court by **10-30 A.M** to raise objections, if any, either in person or through your counse.. If failed to do so, the matter will be decided ex-parte in your absence.

Sd/-D.RAJENDRA REDDY
Advocate-Chittoor